నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
5 | ఖమ్మం, బుధవారం 12 మార్చి 2025 | BHADRADRI KOTHAGUDEM

సొంత ఇల్లు పేదోడి కల. తిన్నా తినకున్నా ఇల్లు ఉంటే చాలు అంటారు పెద్దలు. అదిగో ఆ ఇంటి కోసం ఎన్నో ఏళ్లుగా నిరుపేదలు ఎదురుచూస్తున్నారు. సొంతంగా ఇల్లు నిర్మించుకునే స్తోమత లేక ప్రభుత్వంవైపు కళ్లు తేరిపారచూస్తున్నారు. సర్కార్ సాయానికి తమ కష్టార్జితాన్ని జతచేసి గూడు నిర్మించుకునేందుకు తాపత్రయపడుతున్నారు. కానీ పేద ప్రజల ఆశలపై కాంగ్రెస్ సర్కార్ నీళ్లు జల్లుతున్నది. 'ఇందిరమ్మ ఇండ్ల' పథకంలో ఇండ్లు మంజూరయ్యాయని చెప్పి అధికారులు లబ్ధిదారులకు పత్రాలు సైతం చేతికిచ్చి మళ్లీ క్యాన్సిల్ చేస్తున్నారు. కాంగ్రెసోళ్ల మాటలు నమ్మి కొందరు ఉన్న ఇంటిని సైతం కూల్చుకొని లబోదిబోమంటున్నారు. అర్హులందరికీ ఇండ్లు ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన హస్తం పార్టీ ఇప్పుడు అనర్హులకే పెద్దపీట వేస్తున్నది. అర్హులకు మొండి'చేయి' చూపిస్తున్నది. అదిగో.. ఇదిగో అంటూ మాటలు చెబుతున్నదే తప్ప ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు దాటినా ఇప్పటివరకు ఒక ఇంటికి కూడా పునాది పడలేదన్నది నమ్మలేని నిజం. పైలెట్ గ్రామాల్లో మంగళవారం పర్యటించిన 'నమస్తే తెలంగాణ' బృందానికి ఈ విషయాలన్నీ తేటతెల్లమయ్యాయి. లబ్ధిదారులే స్వయంగా బృందం సభ్యులతో ముచ్చటించారు.

- భద్రాద్రి కొత్తగూడెం, మార్చి 11 (నమస్తే తెలంగాణ)

హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ అధ్యక్షతన మంగళవారం ప్రారంభమైన ఎల్పీ సమావేశానికి హాజరైన ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, అనంతరం విలేకరులతో మాట్లాడుతున్న తాతా మధు

ఇందిరమ్మా ఇల్లేదమ్మా!

- ఇండ్ల జాబితాలో అర్హులకు మొండి'చేయి'
- పైలెట్ గ్రామాల్లో ఫైటింగ్‌లు
- పలుకుబడి ఉన్నోళ్లకే ఇచ్చారని లబ్ధిదారుల ఆగ్రహం
- ఇంతవరకూ పునాదులుపడని ఇండ్లు
- మాటలతోనే కాలం వెళ్లబుచ్చుతున్న కాంగ్రెస్ సర్కార్

అది చుంచుపల్లి మండలం పెనుబల్లి పైలెట్ గ్రామం. అక్కడ నాలుగు గ్యారెంటీలు వందశాతం అమలు చేస్తామని అధికారులు గ్రామసభ నిర్వహించారు. కానీ అక్కడ వంద శాతం అమలు చేయలేకపోగా మంజూరైన ఇళ్లలో కోతపెట్టి గ్రామస్తుల మధ్య చిచ్చుపెట్టారు. దీంతో ఇందిరమ్మ ఇండ్ల బాధితులు రోడ్డెక్కాల్సిన పరిస్థితి వచ్చింది. పంచాయతీ కార్యాలయానికి వచ్చి గ్రామ కార్యదర్శిని నిలదీస్తున్నారు. ఆ గ్రామంలో మొత్తం 379 దరఖాస్తులు రాగా.. అందులో 154 మందిని అర్హులుగా ఎంపిక చేశారు. కానీ అందులో 33 మందికే ఇండ్లు మంజూరు చేసినట్లు చెప్పారు. వారు మాత్రమే అక్కడ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు చేసుకునేందుకు పునాదులు తీసుకున్నారు. మిగతా లబ్ధిదారులు మాత్రం గగ్గోలు పెడుతున్నారు. ఇలాంటి సమస్య భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఒక గ్రామం కాదు ఏకంగా 22 మండలాల్లోని 22 పైలెట్ గ్రామాల్లో ఇలాంటి ఫైటింగ్ నడుస్తున్నది.

పర్ణశాల : ఇందిరమ్మ ఇళ్ల కోసం ఎదురుచూస్తున్న పెద్దకమలాపురం గ్రామస్తులు

చుంచుపల్లి మండలం పెనుబల్లిలో ఇల్లు రాలేదని గడ్డి ఇంటి ముందు ఆవేదన చెందుతున్న బాధితుడు

పైలెట్‌లో ఫైటింగ్..

అవి పేరుకే అవి పైలెట్ గ్రామాలు. అక్కడ ఇప్పుడు ఫైటింగ్‌లు జరుగుతున్నాయి. ఒక గ్రామం కాదు ఏకంగా 22 గ్రామాల్లో ఇదే పరిస్థితి తయారైంది. అర్హులకు ఇండ్లు మంజూరు చేయకపోవడంతో లబ్ధిదారులు గ్రామాల్లో ఫైటింగ్‌కు దిగుతున్నారు. పంచాయతీ కార్యాలయాలకు వెళ్లి కార్యదర్శులను నిలదీస్తున్నారు. గతంలో ఇండ్లు ఇచ్చిన వారికి, డబ్బులు ఉన్నవారికి, పలుకుబడి ఉన్నవారికి ఇండ్లు మంజూరు కావడంతో వారు లబోదిబోమంటున్నారు. కొంతమంది రాజకీయ పలుకుబడితో మంజూరు చేయించుకున్నారని ఆరోపిస్తున్నారు.

పునాదులుపడని ఇండ్లు..

జాబితాల తయారీలోనే అధికారులు నిమగ్నం అవుతున్నారే తప్ప నేటివరకు ఒక్కరికి సైతం కనీసం పునాది బిల్లు ఇప్పించలేదు. ఖాళీ స్థలాన్ని జియో ట్యాగ్ చేసిన తరువాతనే ఇంటికి ముగ్గు పోసుకోవాలని సిబ్బంది చెబుతున్నారు. అయితే గడిచిన కొద్దిరోజుల నుంచి జియో ట్యాగ్ చేద్దామన్నా సర్వర్ డౌన్ కావడంతో పంచాయతీ అధికారులు లబ్ధిదారులకు సమాధానాలు చెప్పలేని పరిస్థితి నెలకొంది. దీంతో ఇందిరమ్మ ఇండ్లకు పునాదులు పడుతాయా? లేదా? అని ఇప్పటికే పాత ఇండ్లు కూల్చుకొని కొత్త ఇండ్ల కోసం ఎదురుచూస్తున్న లబ్ధిదారులు భయపడిపోతున్నారు. వానకాలంలోపు స్లాబ్ వేద్దామని సిద్ధంగా ఉన్న లబ్ధిదారుల ఆశలు అడియాశలు అవుతున్నాయి.

పలుకుబడి ఉన్నోళ్లకేనా..?

నాలుగు గ్యారెంటీల అమలు కోసం సర్కారు ఏర్పాటు చేసిన గ్రామసభల్లో ఇందిరమ్మ ఇండ్ల కోసం జిల్లాలో 82 వేల మంది దరఖాస్తు చేసుకున్నారు. కానీ అందులో పైలెట్ గ్రామాలకు ముందుగా ఇండ్లు ఇవ్వాలని ప్రభుత్వం ఆలోచన చేసినా అక్కడా అసలైన లబ్ధిదారులకు మొండిచెయ్యి చూపించింది. లక్ష్మీదేవిపల్లి మండలం మైలారం గ్రామంలో 210 మందిని ముందుగా అర్హులుగా చూపించి తర్వాత 164 మందికే ఇండ్లు వచ్చాయని మాట మార్చారు. దీంతో అక్కడ ఉన్న గిరిజనులు అధికారుల తీరుపై మండిపడుతున్నారు. అశ్వారావుపేట మండలంలో 106 మందికి మంజూరు చేసి అందులో 53 మందికే ఇండ్లు ఇచ్చారు. అన్నపురెడ్డిపల్లి మండలంలో 152 మందికి 149 మందినే అర్హులు చేశారు. చంద్రుగొండ మండలంలో 264 మందికి 250 మందికే ఇండ్లు మంజూరు చేశారు. జిల్లావ్యాప్తంగా అన్ని గ్రామాల్లో అర్హులకు చేయిచ్చి ఉన్నోళ్లకే ఇండ్లు మంజూరు చేశారు. జిల్లాలో 3,500 మందికి పైగా లబ్ధిదారులను గుర్తించి కేవలం 2,459 మందికే ఇండ్లు మంజూరు చేశారు. ఒక గ్రామానికే ఇన్ని కొట్లాటలు జరిగితే అన్ని గ్రామాలకు అమలు చేస్తే ఎన్ని గలాటాలు జరుగుతాయో అని అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

పేదరాలికి శాపంగా.. ప్రభుత్వ తప్పిదం..

తొలుత అర్హురాలిగా పైలెట్ గ్రామ మహిళకు మంజూరు పత్రం అందజేత
గతంలో ఇందిరమ్మ బిల్లు తీసుకున్నావంటూ తాజాగా మంజూరుపత్రం రద్దు
అధికారుల ఆదేశంతో ముందు రోజే పాత ఇల్లు కూల్చుకున్న గిరిజన మహిళ
ఉన్న ఇంటిని కూల్చుకొని, కొత్త ఇంటిని కోల్పోయి దిక్కుతోచని స్థితిలో పేద మహిళ

కాంగ్రెస్ ప్రభుత్వ తప్పిదం ఓ నిరుపేద గిరిజన మహిళకు శాపంగా మారింది. లబ్ధిదారుల గుర్తింపును, ఎంపిక ప్రక్రియ సమగ్రంగా, పకడ్బందీగా చేపట్టిన కారణంగా ఓ నిరుపేద గిరిజన మహిళ తన గూడును కోల్పోయింది. మళ్లీ కట్టుకోలేని దుస్థితిలోకి వెళ్లింది. దరఖాస్తుల వడపోత సందర్భంలోనే ప్రభుత్వం నిశితంగా పరిశీలించి ఉంటే.. వృద్ధాప్యం సమీపించిన ఓ వితంతువు ఇప్పుడు తన గూడును కోల్పోవాల్సిన పరిస్థితి వచ్చేది కాదు. బాధితురాలి కథనం ప్రకారం..

లక్ష్మీదేవిపల్లి, మార్చి 11

కూల్చివేసిన ఇంటి వద్ద ఇందిరమ్మ ఇంటి మంజూరుపత్రంతో గిరిజన మహిళ

భద్రాద్రి జిల్లా లక్ష్మీదేవిపల్లి మండలం మైలారం పంచాయతీలోని పాతూరు అనే గిరిజన గ్రామం ఆమెది. ఆమె పేరు తాటి లక్ష్మి. గిరిజన మహిళ. ఎన్నో ఏళ్లుగా అదే గ్రామంలో నివసిస్తోంది. ఐదేళ్ల క్రితం భర్త చనిపోయాడు. అయినప్పటికీ ధైర్యంగా ముందడుగు వేసి తన ఇద్దరు పిల్లలకు వివాహాలు జరిపించింది. ఇటుకలతో కూడిన రేకుల ఇంట్లో జీవిస్తోంది. ఈ క్రమంలో ఏడాదిన్న క్రితం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. పేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామంటూ ప్రకటనలు గుప్పించింది. ప్రజాపాలన పేరిట దరఖాస్తులను ఆహ్వానించింది. గతంలో ఇందిరమ్మ ఇళ్లు పొందిన వారికి తాజాగా ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వబోమని, ఇంతకుముందు ఇందిరమ్మ ఇళ్లు పొందని వారికే ఈ దఫాలో మంజూరు చేస్తామని స్పష్టం చేసింది. అందుకు మార్గదర్శకాలను కూడా విడుదల చేసింది. కానీ చివరికి తన మార్గదర్శకాలను తానే పాటించలేకపోయింది. గణతంత్ర దినోత్సవం సందర్భంగా జనవరి 26న ఆ గ్రామంలో గ్రామసభ పెట్టింది. ఆ ఊరిని పైలెట్ గ్రామంగా ప్రకటించింది. ఆ గ్రామంలోని ప్రజాపాలన దరఖాస్తుదారుల్లో రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులకు అర్హులను గుర్తించింది. వెంటనే లబ్ధిదారులకు ఆయా పథకాల మంజూరు పత్రాలు పంపిణీ చేసింది. ఇందులో భాగంగా తాటి లక్ష్మిని ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారురాలిగా గుర్తించి మంజూరు పత్రం అందజేసింది. ఈ మేరకు అధికారులు ఇటీవల ఆమె ఇంటి వద్దకు వెళ్లారు. 'నీకు ఇందిరమ్మ ఇల్లు మంజూరైంది. పాత ఇంటిని కూల్చేసి మొత్తం చదును చేసి ముగ్గు పోసుకో..' అంటూ ఆదేశించి వెళ్లారు. సాక్షాత్తూ ప్రభుత్వమే మంజూరు పత్రం ఇవ్వడం, అధికారులు వచ్చి ముగ్గు పోసుకోవాలని ఆదేశించడంతో ఆమె కూడా హుటాహుటిన రూ.15 వేలు వెచ్చించి తన పాత ఇంటిని కూల్చి వేయించింది. అధికారుల ఆదేశాల మేరకు ముగ్గు కూడా పోయించింది. ఇంతలో మరుసటి రోజు ఆ గ్రామ పంచాయతీ కార్యదర్శి ఆమెకు ఫోన్ చేశారు. 'గతంలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణం కోసం అప్పటి ప్రభుత్వం నుంచి నీవు రూ.40 వేలు పొందావు. అందుకని ఇప్పుడు నీకు ఇందిరమ్మ ఇల్లు రాదు. తాజాగా మంజూరైన ఇందిరమ్మ ఇల్లు రద్దయింది' అంటూ స్పష్టం చేశారు. దీంతో లబోదిబోమంటూ ఆమె ఎండలోనే కూలబడింది. ఈ కాంగ్రెస్ ప్రభుత్వమే తనకు ఇంటిని మంజూరు చేసిందని, ఇప్పుడు రద్దుచేశామంటూ చెబుతోందని ఆవేదన వ్యక్తం చేసింది. ముందే చెప్పి ఉంటే తాను తన గూడును కూల్చుకునేదాన్ని కాదని తలబాదుకుంది. భర్త కూడా లేని తాను ఇప్పుడు మరో గూడును ఎలా నిర్మించుకోగలనంటూ నెత్తీనోరూ బాదుకుంది. సర్కారు చేసిన తప్పిదానికి తాను నిలువ నీడ కోల్పోయానంటూ కన్నీటిపర్యంతమైంది.

నా ఇల్లు వానకు తడుస్తది..

నా ఇల్లు చూస్తే ఎవరూ లోపలికి కూడా రారు. వానకు ఇళ్లంతా కురుస్తది. పడిపోయే స్థితిలో ఉంది. నాకు భార్య, ఇద్దరు పిల్లలు. కూలి చేసుకుని బతుకుతున్నాం. ఇంటి కోసం దరఖాస్తు పెట్టుకున్నాను. మొదటి పేరు నాదే ఉంది. కానీ నాకు ఇల్లు రాలేదు. ఏమిటని అడిగితే లిస్టులో పేరు రాలేదంటున్నారు. ఇంత అన్యాయమా?

– మారుతి భద్రయ్య, కూలీ, పెనుబల్లి

పరదాల కింద ఉంటున్నాను..

మా నాన్న వాళ్ల ఇంటి పరదాల కింద ఉంటున్నాను. నాకు ఇల్లు రాలేదు. ఉన్నోళ్లకే ఇచ్చారు. అప్పుడు ఇందిరమ్మ ఇళ్లు ఉన్నోళ్లకు ఇప్పుడు ఇళ్లు వచ్చాయి. డాబాలు ఉన్న వాళ్లకు కూడా ఇళ్లు ఇచ్చారు. మేము రాజకీయంగా తిరగడం లేదని మాకు లేకుండా చేశారు. పేదోళ్లపై సర్కారు చూపించే మమకారం ఇదేనా. ఇంత అక్కసు చూపెడుతున్నారు.

– కంటె వెంకటేశ్వర్లు, పెనుబల్లి, చుంచుపల్లి మండలం

ఆదివాసీలకు కూడా ఇల్లు ఇవ్వరా?

నేను ఆదివాసీని. నాకు కూడా ఇల్లు రాలేదు. ఇంత అన్యాయం ఉంటదా. నాకు ఇల్లు లేదు. పందిరి వేసి రేకులు వేసుకున్న. వాన, గాలి వస్తే మళ్లీ చెట్లకిందనే ఉండాలి. నాలాంటోడికి కూడా ఇల్లు ఇవ్వరా? అడవి బతుకులు బతుకుతున్నాం. మాకు ఎవరూ న్యాయం చేయడం లేదు.

– కోరెం వంశీ, పాతూరు, లక్ష్మీదేవిపల్లి మండలం

ఇద్దరిలో ఒకరికే ఇస్తామంటున్నారు..

ఆనాడు మా ఇంట్లో ఇద్దరం అన్నదమ్ములం ఇండ్లులేక ఇబ్బందులు పడుతున్నామని అధికారులు గుర్తించారు. మాకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అయినట్లు కలెక్టర్ గారి పేరుతో పత్రాలు కూడా ఇచ్చారు. ఇద్దరికీ పెళ్లిళ్లు అయ్యాయి. పిల్లలు కూడా ఉన్నారు. కానీ తీరా ఇప్పుడు మాత్రం మీ ఇద్దరిలో ఒక్కరికే ఇల్లు వస్తుందని, ఎవరికి కావాలో మేరే తేల్చుకోవాలని చెబుతున్నారు. అన్నదమ్ముల మధ్య ఇలా పంచాయితీ పెడితే ఎలా? ఇద్దరం పేదవాళ్లం. అర్హత కలిగిన ప్రతిఒక్కరికి ఇస్తామని చెప్పి ఇలా తిప్పడం సరికాదు. పెద్ద అధికారులు జోక్యం చేసుకొని మా కుటుంబానికి న్యాయం చేయాలి.

– కిన్నెర నరేశ్, ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారుడు, ఆరెంపుల, ఖమ్మంరూరల్ మండలం

పేదలందరికీ ఇండ్లు ఇవ్వాలి..

మాకు ఖాళీ స్థలం ఉంది. ఉన్న ఇల్లు బాగాలేదు. ఇందిరమ్మ ఇల్లు వస్తే కట్టుకుందామనుకున్నా. మా ఊళ్లో 55 ఇండ్లు వస్తయన్నరు. చివరకి 13 మందినే ఎంపిక చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదోళ్లకు అన్యాయం చేస్తున్నది. ఇందిరమ్మ రాజ్యంలో పేదలకు న్యాయం జరగట్లేదు. అర్హులందరికీ ఇండ్లు ఇవ్వాలి.

– చిప్పలపల్లి మధు, ఏలువారి గూడెం, తిరుమలాయపాలెం మండలం

ఇంటి కోసం ఎదురుచూస్తున్నాం..

మా గ్రామంలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణం కోసం లబ్ధిదారులు వేయికండ్లతో ఎదురుచూస్తున్నారు. అధికారులు ఇల్లు నమూనా చూపించి ఇలా నిర్మాణం చేపట్టండి అంటున్నారు.. అయితే అధికారులే దగ్గరుండి ఇంటికి సంబంధించిన ప్లాన్ వేసి నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకోవాలి.

– జయబాబు, లబ్ధిదారుడు, ఎర్రబోరు గ్రామం, పర్ణశాల

హామీల అమలులో సర్కారు విఫలం

బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు

రేగా కాంతారావు

మణుగూరు టౌన్, మార్చి 11 : ప్రజా పాలన అంటూ గొప్పలు చెప్పుకునే రేవంత్‌రెడ్డి సర్కారు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు ఆరోపించారు. ఈ మేరకు మంగళవారం ఆయనొక ప్రకటన విడుదల చేశారు. పైలెట్ గ్రామాలను ఎంపిక చేసి ప్రభుత్వ పథకాలను వంద శాతం అక్కడి నుంచే అమలు చేస్తామని చెప్పిన ప్రభుత్వం ఒక్క పథకాన్ని కూడా పూర్తిస్థాయిలో అమలు చేయలేదని పేర్కొన్నారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు.. ఇలా ఒక్కటి కూడా అమలు చేయకపోవడంతో దరఖాస్తు చేసుకున్న ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగడమే పనిగా పెట్టుకున్నారని తెలిపారు. ప్రభుత్వ వైఫల్యాలను బీఆర్ఎస్ శ్రేణులు ఊరూరా, వాడవాడలా తిరిగి ప్రజలకు వివరించాలన్నారు. మణుగూరు ఓసీ విస్తరణలో భాగంగా భూసేకరణ కోసం మణుగూరు, తిర్లాపురం, రామానుజవరం రెవెన్యూ పరిధిలో రెండు పంటలు పండే భూములను తీసుకునే ప్రక్రియను సింగరేణి అధికారులు ప్రారంభించారని, ఈ విషయంలో రైతులకు సరైన న్యాయం చేయాలని ఆయన కోరారు.

దివ్యాంగుల ఐడీకార్డుపై అపోహలు వద్దు..

– కలెక్టర్ జితేశ్ వీ పాటిల్

మాట్లాడుతున్న కలెక్టర్ జితేశ్ వి పాటిల్

కొత్తగూడెం అర్బన్, మార్చి 11 : దివ్యాంగులకు యూనిక్ డిజబులిటీ ఐడీ కార్డు జారీపై ఎటువంటి అపోహలు పెట్టుకోవద్దని కలెక్టర్ జితేశ్ వి పాటిల్ అన్నారు. మంగళవారం ఐడీవోసీ కార్యాలయ సమావేశ మందిరంలో మహిళా, శిశు, వయోవృద్ధుల, దివ్యాంగుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో దివ్యాంగులు, మీ సేవా కేంద్ర నిర్వాహకులకు యూనిక్ డిజబులిటీ ఐడీ కార్డు జారీపై అవగాహన సదస్సు నిర్వహించారు. దివ్యాంగులకు ఇకపై సదరం సర్టిఫికెట్లు జారీ విధానం ఉండదని, వారికి యూడీఐడీ కార్డులు జారీ చేయనున్నట్లు తెలిపారు. వైద్యులు ధ్రువీకరించిన వైకల్య శాతం సర్టిఫికెట్, దివ్యాంగుల పూర్తి వివరాలను యూడీఐడీ పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. యూడీఐడీ కార్డులు స్పీడ్ పోస్టు ద్వారా నేరుగా దివ్యాంగుల చిరునామాకు చేరుతాయన్నారు. మీ సేవా కేంద్రాల్లో అదనంగా రుసుము వసూలు చేస్తే కఠినచర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ విద్యాచందన, మహిళా శిశు సంక్షేమాధికారి స్వర్ణలత లెనీనా, జిల్లా ఉపాధి కల్పనాధికారి శ్రీరాం, ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ రాంమోహన్, విద్యాశాఖ కోఆర్డినేటర్ సైదులు పాల్గొన్నారు.

కమీషన్ల కోసమే పనిచేస్తున్న సర్కారు

ప్రతీ పనికి 20 శాతం చొప్పున వసూళ్లు
పంటలు ఎండుతున్నా పట్టించుకునే వారు కరువు
సమావేశంలో జడ్పీ మాజీ చైర్మన్ కమల్‌రాజు



మాట్లాడుతున్న లింగాల కమల్‌రాజు

ఎర్రుపాలెం, మార్చి 11 : రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కమీషన్ల కోసం తప్ప ప్రజల కోసం పనిచేయడం లేదని, ప్రతీ పనికి 20 శాతం చొప్పున కమీషన్లు వసూలు చేయడమే పనిగా పెట్టుకున్నదని జడ్పీ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ మధిర నియోజకవర్గ ఇన్‌చార్జి లింగాల కమల్‌రాజు ఆరోపించారు. ఇనగాలి గ్రామంలోని బాలరాఘవ రెడ్డి నివాసంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సచివాలయంలో మధిర ఎమ్మెల్యే, డిప్యూటీ సీఎం చాంబర్ ముందు ఆయన అనుచరులు కాంట్రాక్టర్లను 20 శాతం చొప్పున కమీషన్లు అడుగుతున్నారని ఆరోపించారు. గతంలో మధిరను పరిపాలించిన శీలం సిద్ధారెడ్డి, దుగ్గినేని వెంకట్రామయ్య, వెంకట్రాపమ్మ, బోడేపూడి వెంకటేశ్వరరావు, కొండబాల కోటేశ్వరరావు, కట్టా వెంకటనర్సయ్య మధిర కీర్తిని పెంచేలా ప్రజల కోసం పని చేశారని గుర్తు చేశారు. ఎర్రుపాలెం మండలంలో సాగర్ జలాలు అందక యాసంగి పంటలు ఎండిపోతున్నా పట్టించుకునేవారు కరువయ్యారన్నారు. అన్ని వర్గాలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క సంక్షేమ పథకాన్ని కూడా పూర్తిగా ఇవ్వకపోగా.. ప్రశ్నిస్తున్న ప్రతిపక్షంపై ఎదురు దాడికి దిగడం ఎంత వరకు సబబు అని ఆయన ప్రశ్నించారు. ఇచ్చిన 420 హామీలు పూర్తిగా అటకెక్కించి, కమీషన్ల కోసం కక్కుర్తి పడుతూ పాలనను గాలికొదిలేసిందన్నారు. ఇప్పటివరకు ఉమ్మడి రాష్ట్రంలో ఎందరో ముఖ్యమంత్రులు పాలించారని, కానీ.. రేవంత్‌రెడ్డిపై ఇంత త్వరగా వచ్చిన వ్యతిరేకత ఇంకెవరిపై రాలేదన్నారు. అనంతరం ఇనగాలి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు వేమిరెడ్డి శ్రీనివాసరెడ్డి కుమార్తె పెళ్లికి హాజరై వధువును ఆశీర్వదించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ శీలం కవిత, పార్టీ మండల కార్యదర్శి యన్నం శ్రీనివాసరెడ్డి, నాయకులు సంక్రాంతి కృష్ణారావు, వేమిరెడ్డి బాలరాఘవరెడ్డి, పుల్లారెడ్డి, సిద్ధారెడ్డి, కృష్ణారెడ్డి, తిరుపతిరావు, బొగ్రా నరసింహారావు, నాగరాజు పాల్గొన్నారు.

ఏసీబీకి చిక్కిన ఎక్సైజ్ శాఖ సీనియర్ అసిస్టెంట్

రూ.1,500 తీసుకుంటుండగా పట్టుకున్న అధికారులు

ఖమ్మంలో ఏసీబీ అధికారులకు చిక్కిన ఎక్సైజ్ శాఖ సీనియర్ అసిస్టెంట్ సోమ్లానాయక్

మామిళ్లగూడెం, మార్చి 11 : ఓ బార్‌కు సంబంధించి లైసెన్స్ కాపీల జిరాక్స్ కోసం యజమాని నుంచి లంచం డిమాండ్ చేసిన ఎక్సైజ్ శాఖ సీనియర్ అసిస్టెంట్‌ను ఏసీబీ అధికారులు వలపన్ని పట్టుకున్నారు. ఈ ఘటన ఖమ్మం నగరంలో మంగళవారం చోటు చేసుకుంది. ఏసీబీ డీఎస్పీ వై.రమేశ్ కథనం ప్రకారం.. ఖమ్మం నగరంలో బార్ అండ్ రెస్టారెంట్ నిర్వహిస్తున్న ఓ యజమాని తన బార్‌కు సంబంధించి లైసెన్స్ కాపీలు జిరాక్స్ కావాలని జిల్లా ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ శాఖ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న భూక్యా సోమ్లానాయక్‌ను సంప్రదించాడు. జిరాక్స్ కాపీలు కావాలంటే రూ.2 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. సదరు బాధితుడు రూ.2 వేలు ఇవ్వలేనని చెప్పడంతో కనీసం రూ.1,500 ఇవ్వాలని చెప్పడంతో ఆ మొత్తం ఇచ్చేందుకు బాధితుడు ఒప్పుకున్నాడు. అనంతరం బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించి పరిస్థితిని వివరించాడు. వారు పన్నిన పథకం ప్రకారం తన కార్యాలయంలో రూ.1,500 లంచం తీసుకుంటుండగా అక్కడే మాటువేసిన ఏసీబీ అధికారులు సోమ్లానాయక్‌ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకొని కేసు నమోదు చేశారు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏసీబీ డీఎస్పీ రమేశ్ తెలిపారు. ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పని చేసేందుకు లంచం అడిగితే బాధితులు నేరుగా టోల్‌ఫ్రీ నెంబర్ 1064లో సంప్రదించాలని ఆయన కోరారు. తనిఖీల్లో సీఐ శేఖర్, ఏసీబీ సిబ్బంది పాల్గొన్నారు.

అటవీ శాఖ అధికారుల తీరును నిరసిస్తూ రాస్తారోకో

రామన్నగూడెంలో బోర్‌వెల్ పనులను అడ్డుకున్న గిరిజనులు
క్షేత్రస్థాయిలో పరిశీలన చేస్తామని హామీ ఇచ్చిన తహసీల్దార్

రామన్నగూడెంలో రహదారిపై బైఠాయించి ఆందోళన చేస్తున్న గిరిజనులు

అశ్వారావుపేట రూరల్/అశ్వారావుపేట టౌన్ మార్చి 11 : అటవీ శాఖకు చెందిన టేకు ప్లాంటేషన్‌లో అధికారులు బోర్‌వెల్ వేస్తుండగా గిరిజనులు అడ్డుకొని రాస్తారోకో చేశారు. ఈ ఘటన అశ్వారావుపేట మండలం రామన్నగూడెం గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామ సమీపంలోని అటవీ శాఖకు చెందిన టేకు ప్లాంటేషన్‌లో జంతువుల తాగునీటి కోసం అటవీ శాఖ అధికారులు బోర్ వేస్తున్నారు. ఈ క్రమంలో విషయం తెలుసుకున్న గ్రామస్తులు, గిరిజన సంఘం నాయకుడు నాగేశ్వరరావు తమ వద్ద ఉన్న ఆధారాలను చూపుతూ ఈ సర్వే నెంబర్‌పై హైకోర్టు నుంచి స్టేటస్ కో తీసుకున్నామని, నిబంధనలకు విరుద్ధంగా అటవీ శాఖ అధికారులు పనులు చేపట్టడం సరికాదని ఘటనా స్థలానికి చేరుకున్న అదనపు ఎస్సై రామ్మూర్తి, రేంజర్ మురళికి వివరించారు. గిరిజనులు చెప్పిన విధంగా 36, 37 సర్వే నెంబర్లు కావని, ఆ సర్వే నెంబర్లు లంకాలపల్లి సరిహద్దుల్లో ఉన్నాయని చెప్పగా.. ఇరువర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో అదనపు ఎస్సై కలుగజేసుకుని సమస్యను శాంతియుతంగా తహసీల్దార్ సమక్షంలో పరిష్కరించుకోవాలని నచ్చజెప్పారు. అనంతరం గిరిజనులు తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని తహసీల్దార్ వనం కృష్ణప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. జాయింట్ సర్వే నిర్వహించి రామన్నగూడెం గిరిజనులకు భూములు అధికారికంగా అప్పగించాలని కోరారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కృష్ణప్రసాద్ మాట్లాడుతూ గిరిజనులు, అటవీ శాఖకు మధ్య వివాదంగా ఉన్న రామన్నగూడెం భూములపై స్టేటస్ కో ఉన్నది నిజమేనని, బోర్‌వెల్ వేస్తున్న భూములు ఏ సర్వే నెంబర్‌లో ఉన్నవనే దానిపై ఆర్ఐ క్షేత్రస్థాయిలో పరిశీలించిన తర్వాత తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గిరిజనులు మాత్రం ఆ భూమి అటవీ శాఖదా? తమదా?తేల్చాలని పట్టుబట్టారు. తిరిగి ప్లాంటేషన్‌కు చేరుకుని బోర్‌వెల్ పనులకు అడ్డుగా నిలిచారు. సాయంత్రం వరకు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది.